
జస్టిస్ లక్ష్మీనారాయణ


జస్టిస్ అనిల్‌కుమార్


జస్టిస్ సుజన

## హైకోర్టు శాశ్వత న్యాయమూర్తులుగా ముగ్గురి నియామకం

హైదరాబాద్, ఫిబ్రవరి 13 (నమస్తే తెలంగాణ): తెలంగాణ హైకోర్టులో అదనపు జడ్జీలుగా పనిచేస్తున్న జస్టిస్ లక్ష్మీనారాయణ అలిశెట్టి, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి, జస్టిస్ సుజన కలసికంలను పర్మినెంట్ న్యాయమూర్తులుగా నియమిస్తూ కేంద్రం ఉత్తర్వులు జారీచేసింది. 2023 జూలై 31న అదనపు న్యాయమూర్తులుగా బాధ్యతలు చేపట్టిన ఈ ముగ్గురినీ శాశ్వత న్యాయమూర్తుల నియామకం కోసం ఇటీవల సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు చేసిన విషయం విదితమే. సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసులను పరిగణనలోకి తీసుకున్న కేంద్రం ఆ ముగ్గురిని శాశ్వత న్యాయమూర్తులుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. శుక్రవారం మధ్యాహ్నం 2.15 గంటలకు మొదటి కోర్టు హాలులో తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్ పాల్ వీరితో ప్రమాణం చేయించనున్నారు.

### మహిళా జడ్జిపై పాదరక్ష విసిరిన నిందితుడు

## చితకబాదిన న్యాయవాదులు

రంగారెడ్డి జిల్లా కోర్టులు, ఫిబ్రవరి 13(నమస్తే తెలంగాణ): ఓ కేసులో విచారణ ఎదుర్కొంటున్న నిందితుడు మహిళా న్యాయమూర్తిపై పాదరక్ష విసిరిన ఘటన రంగారెడ్డి జిల్లా కోర్టులో కలకలం రేపింది. హత్యాయత్నం, మారణాయుధాల కేసులో నిందితుడు కరణ్‌సింగ్ విచారణ సమయంలో హఠాత్తుగా చెప్పు తీసి న్యాయమూర్తిపై విసిరాడు. ఒక్కసారిగా నిర్ఘాంతపోయిన సిబ్బంది, న్యాయవాదులు అతన్ని పట్టుకొని చితకబాదారు.

## కేసీఆర్ పిటిషన్‌లో మధ్యంతర ఉత్తర్వుల పొడిగింపు

### ప్రతివాది కౌంటర్ దాఖలు చేయకపోవడంపై హైకోర్టు ఆగ్రహం

హైదరాబాద్, ఫిబ్రవరి 13 (నమస్తే తెలంగాణ): మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటుకు నిర్మాణాల్లో అక్రమాలు జరిగాయని, ఇందుకు ఆనాటి సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, ఇతర బాధ్యులపై దర్యాప్తు జరపాలంటూ దాఖలైన ప్రైవేట్ పిటిషన్‌పై విచారణ జరపాలన్న కింది కోర్టు నిర్ణయాన్ని నిలిపివేస్తూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను హైకోర్టు గురువారం మరోసారి పొడిగించింది. ఈ కేసులో ప్రతివాది, ఫిర్యాదుదారైన నాగపల్లి రాజలింగమూర్తి కౌంటరు దాఖలు చేయకపోవడంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. తదుపరి విచారణను ఈ నెల 20కి వాయిదా వేసింది. ఈలోగా ఫిర్యాదుదారుడు కౌంటర్ దాఖలు చేయాలని మరోసారి ఆదేశించింది.

## 'రిమాండ్‌ను కొట్టేయండి'

హైదరాబాద్, ఫిబ్రవరి 13 (నమస్తే తెలంగాణ)/మొయినాబాద్: చిలుకూరు బాలాజీ ఆలయ పూజారిపై దాడి కేసులో రిమాండ్ విధించడాన్ని సవాలు చేస్తూ నిందితుడు కే వీరరాఘవరెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఆయన తరపున న్యాయవాది సుంకర నరేశ్ వాదనలు వినిపిస్తూ.. ఈ కేసులో ఎలాంటి ఆధారాలు లేకపోయినప్పటికీ కింది కోర్టు అన్యాయంగా రిమాండ్ విధించిందని చెప్పారు. ఇలా చేయడం ప్రాథమిక హక్కులకు భంగం కలిగించడమేనన్నారు. రిమాండ్ ఉత్తర్వులను రద్దు చేయాలని కోరారు. వాదనల తర్వాత హైకోర్టు పోలీసుల వివరణ నిమిత్తం విచారణను 14కు వాయిదా వేసింది. ఈ దాడి కేసులో పోలీసులు గురువారం మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు.




















